నమస్తే తెలంగాణ





## ఎంపీ దామోదర్ రావుకు గుత్తా పరామర్శ

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : రాజ్యసభ సభ్యుడు దీవకొండ దామోదర్ రావును పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఇటీవల దామోదర్ రావు తల్లి అండాళమ్మ కన్నుమూశారు. ఈ నేపథ్యంలో బుధవారం దామోదర్‌రావును బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కలిసి పరామర్శించారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా దామోదర్‌రావును పరామర్శించారు.

## నేడు ఖమ్మంలో 'కేసీఆర్‌కు కృతజ్ఞత' సభ

### హాజరుకానున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

### వద్దిరాజుకు మరోసారి 'రాజ్యసభ' అవకాశంపై శ్రేణుల్లో ఉత్సాహం



ఖమ్మం, మార్చి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ నేత, బలహీన వర్గాల నాయకుడు వద్దిరాజు రవిచంద్రకు రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి అవకాశం కల్పించిన పార్టీ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుకునేందుకు ఆ పార్టీ ఖమ్మం జిల్లా నేతలు గురువారం నగరంలో 'కేసీఆర్‌కు కృతజ్ఞత' పేరిట సభను నిర్వహించనున్నారు. అలాగే రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి ఎన్నికైన తరువాత తొలిసారి ఖమ్మం జిల్లాకు వస్తున్న వద్దిరాజును ఘనంగా సన్మానించాలని పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు ఖమ్మం బైపాస్ రోడ్డులోని గాయత్రి గౌండ్స్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభం కానుంది. సభకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. బడుగు, బలహీన వర్గాల నేతగా గుర్తింపు పొందిన వద్దిరాజు రవిచంద్రకు మరోసారి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇవ్వడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ సభలో ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, రాములునాయక్, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, హరిప్రియానాయక్, మదన్‌లాల్, చంద్రావతి, మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొనున్నారు.

## లోకం పోకడ




అన్నదమ్ముల సమాన ఆస్తి పంపకాలు ఎప్పుడంటూ నా దగ్గరికైతే రావుగదా తమ్మీ?!

# రాహుల్‌కు రేవంత్ మోసం!

## కాంగ్రెస్ గెలవదని ఆయనే చెప్పేశారు • మోదీ ఆశీస్సుల కోసం సీఎం తాపత్రయం

### వైట్‌పేపర్ అంటూ బీజేపీకి లవ్ లెటర్స్ • బీజేపీ నేతలు రేవంత్‌ను పొగుడుతున్నారు

### వచ్చే ఎన్నికలు రెఫరెండమన్న రేవంత్ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నాం

### రైతులకు ఇచ్చిన ఒక్క హామీనీ కాంగ్రెస్ నెరవేర్చలే • వృద్ధులకు ఒక నెల పింఛన్ ఎగరగొట్టారు

### 30 లక్షల మందికేనా ఉచిత విద్యుత్తు? • మీడియాతో ఇష్టాగోష్ఠిలో హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలనే కాకుండా రాహుల్‌గాంధీ, సోనియాగాంధీని సైతం మోసం చేశారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. గుజరాత్ మాడల్ ఫెయిల్యూర్ అని రాహుల్ అంటుంటే, అదే కావాలని రేవంత్ అంటున్నారని ఎద్దేవా చేశారు. మోదీ మళ్లీ ప్రధాని కావడం పక్కా అని రేవంత్ వ్యాఖ్యలను బట్టి తెలుస్తున్నదని, దీనిని బట్టి కాంగ్రెస్ గెలిచే పరిస్థితి లేదని చెప్పకనే చెప్పేశారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ ఆశీస్సులు కంటే మోదీ ఆశీస్సుల కోసమే రేవంత్ ఎక్కువగా తాపత్రయపడుతున్నారని చెప్పారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ హరీశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు ఎన్నికలు రేవంత్‌రెడ్డి రెఫరెండం అనడాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. ఇచ్చిన హామీల్లో అనేకం అమలు చేయలేదని, చేస్తున్న వాటికి షరతులు అంటూ ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి తన వంద రోజుల పాలనలో వైట్ పేపర్, బ్లాక్ పేపర్ అంటూ బీజేపీకి లవ్‌లెటర్ రాశారని విమర్శించారు. సీఎం కార్యాలయానికి వెళ్లే విలేకరుల పెన్నులు, ఫోన్లు గుంజుకుంటున్నారని, ఇదెక్కడి నిరంకుశత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఓట్లెట్లా అడుగుతరు?

రైతులకు ఇచ్చిన హామీల్లో కాంగ్రెస్ ఏ ఒక్కటీ అమలు చేయలేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. డిసెంబరు 9న రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి చేయలేదని, వరికి బోనస్, ఉచితంగా 24 గంటల విద్యుత్తు, రైతు భరోసా ఏదీ అమలు చేయలేదని మండిపడ్డారు. ఒక్క హామీ కూడా అమలు చేయనందుకు కాంగ్రెస్‌కు రైతులు ఓటు వేయాలా? అని ప్రశ్నించారు. త్వరలోనే యాసంగి పంట రాబోతున్నదని, ఇప్పటికైనా రూ. 500 బోనస్ ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ వచ్చాక రాష్ట్రంలో కరువు వచ్చిందని పేర్కొన్నారు. విద్యుత్తు సరఫరా సక్రమంగా లేక మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు దానిని అమలు చేయలేదని విమర్శించారు. డిసెంబరు నుంచే రూ. 4 వేల పింఛన్ ఇస్తామని చెప్పి అమలు చేయలేదని, రాష్ట్రంలోని 44 లక్షలమంది పింఛనదారులు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీలపై బాండ్ పేపర్లు ఇచ్చినందుకు ఎవరిపై కేసులు పెట్టాలని ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 పథకం ఏమైందని నిలదీసిన హరీశ్‌రావు.. వారిని మహాలక్ష్ములను చేస్తామని మాటతప్పినందుకు మీకు ఓటు వేయాలా? ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేస్తామని చెప్పి ఇప్పుడు ఫీజు వసూలు చేస్తున్నందుకు ఓటువేయాలా? అని ప్రశ్నించారు. ఆటోడ్రైవర్లు చనిపోతున్నా పట్టించుకోనందుకు, నిరుద్యోగ భృతి ఇస్తామని మాట తప్పినందుకు, దళితబంధు రద్దుచేసినందుకు, కల్యాణలక్ష్మి కింద రూ. లక్షతోపాటు తులం బంగారం ఇస్తామని మోసం చేసినందుకు ఓట్లు వేయాలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ



ప్రాపకం కోసం ఎవరు ప్రయాసపడుతున్నారో ప్రధాని పర్యటనతోనే అర్థమైందని హరీశ్ అన్నారు. బీఆర్ఎస్ ఎంపీలను బీజేపీ తీసుకుందని, అలాంటి బీజేపీతో తామెందుకు కలిసి వెళ్తామని ప్రశ్నించారు. బీజేపీ నేతలు మురళీధర్‌రావు, మాధవీలత రేవంత్ రెడ్డిని మెచ్చుకుంటున్నారని చెప్పారు. ప్రజాదర్బార్‌తో హడావుడి చేసిన రేవంత్‌రెడ్డి ఒక్కరోజు మాత్రమే వెళ్లి వదిలేశారని మండిపడ్డారు.

### 30 వేల ఉద్యోగాలు ఎలా భర్తీ చేశారు?

తాము 30 వేల ఉద్యోగాలు భర్తీచేశామని కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటున్నదని, ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా ఎలా భర్తీ చేశారని హరీశ్‌రావు నిలదీశారు. అవన్నీ బీఆర్ఎస్ ఇచ్చినవేనని, రేవంత్ రెడ్డి నియామకపత్రాలు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. తాము 1.6 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. 21 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్న రేవంత్‌రెడ్డి 11 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఎందుకు ఇచ్చారని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఎటుపోయాయని నిలదీశారు. డీఎస్సీకి ఫీజు తీసుకోబోమని చెప్పి ఇప్పుడు ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.

### మూడు నెలలుగా జీతాల్లేవు

ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న 22 వేల మందికి మూడు నెలలుగా వేతనాలు లేవని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఒక నెల పింఛన్ ఎగురగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల కోసం ఉద్దేశించిన సీఎంఆర్ఎఫ్‌ను ఆపారని, 60 వేలకు పైగా దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. తమపై కోపంతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. పోలవరం కట్టింది కేంద్రమేనని, వరదల్లో దాని డయాఫ్రంవాల్, కాఫర్‌డ్యాం కొట్టుకుపోయాయని పేర్కొన్నారు. ఐదేండ్లు అయినా పోలవరంపై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక రాలేదని, కాళేశ్వరం ప్రాజెక్టుకు మాత్రం రెండు రోజుల్లోనే రిపోర్ట్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

### 30 లక్షల మందికే ఉచిత విద్యుత్తు

రాష్ట్రంలో 90 లక్షల రేషన్‌కార్డులు ఉంటే 30 లక్షల మందికి మాత్రమే ఉచిత విద్యుత్తు ఇస్తున్నారని, 200 యూనిట్లు దాటితే మొత్తం బిల్లు కట్టాలంటూ పథకాన్ని తూట్లు పొడిచారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే పని మొదలుపెట్టవచ్చని, దానికి ప్రధాని అనుమతి అవసరం లేదన్నారు. కేసీఆర్‌కు ఆరోగ్యం బాగాలేదని తెలిసి కూడా రాష్ట్రంలో ప్రతిపక్ష నేత లేడని చెప్పడం రేవంత్‌రెడ్డి స్థాయికి తగదని హితవు పలికారు. మూడు నెలల్లో రూ. 16 వేల కోట్ల అప్పులు తెచ్చారని, మరిన్ని అప్పుల కోసం ఢిల్లీలో ప్రయత్నాలు చేస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## యూఎస్ సదస్సుకు తెలంగాణ యువతి ఎంపిక

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి గ్రామానికి చెందిన సోషల్ వర్కర్ చందన 'యూఎస్ జ్యుడీషియల్ విధానం' అనే అంశంపై అమెరికాలో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ విజిటర్ లీడర్‌షిప్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. మొత్తం 22 దేశాల ప్రతినిధులు పాల్గొనే ఈ కార్యక్రమంలో మనదేశం తరపున తెలంగాణ నుంచి చందన ఎంపిక కావడం విశేషం. చైల్డ్ ప్రొటెక్షన్ అండ్ ఉమెన్ రైట్స్.. అనే అంశంపై ఆమె పోరాటాన్ని గుర్తించిన యూఎస్ ప్రతినిధులు చందనను ఆహ్వానించారు. ప్రస్తుతం 'బచ్‌పన్ బచావో ఆందోళన్'లో స్టేట్ కోఆర్డినేటర్‌గా ఆమె చురుగ్గా పని చేస్తున్నారు. చిన్న పిల్లలు, మహిళల కోసం యూఎస్ న్యాయవ్యవస్థలో ఉన్న అంశాలతో పాటు వివిధ దేశాల్లోని న్యాయ వ్యవస్థల్లోనూ ఏ విధంగా ఉన్నాయన్న అంశాలపైనా ప్రతినిధులకు నిర్వహించే పలు కార్యక్రమాల్లో తాను పాల్గొని చర్చించనున్నట్టు చందన తెలిపారు. అమెరికాలో ఏప్రిల్ 6 నుంచి 27 వరకు జరిగే ఆయా కార్యక్రమాల్లో తాను పాల్గొంటానని తెలిపారు.

## భారత జాగృతి దీక్షకు అనుమతి ఇవ్వండి

### డీజీపీని కోరిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): భారత జాగృతి దీక్ష కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని డీజీపీ రవిగుప్తాను భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత కోరారు. ఈ విషయమై కవిత బుధవారం డీజీపీతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ నియామకాల్లో జీవో-3 వల్ల మహిళలకు రిజర్వేషన్ అమలులో జరుగుతున్న అన్యాయంపై ఈ నెల 8న ధర్నా తలపెట్టినట్టు ఆమె తెలిపారు. ఇది చాలా ముఖ్యమైన అంశమని స్పష్టం చేశారు. తాము శాంతియుతంగానే దీక్ష నిర్వహిస్తామని కవిత డీజీపీకి తెలియజేశారు.

## సొంత జాగా, రేషన్‌కార్డు ఉంటేనే ఇందిరమ్మ ఇల్లు

మొదటిపేజీ తరువాయి...

సచివాలయంలో హౌసింగ్‌బోర్డు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సహాయం అందించడానికి అవసరమైన కార్యచరణ ప్రారంభించిందని చెప్పారు. ఈ పథకాన్ని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్, జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారని తెలిపారు. తొలి విడతలో సొంత స్థలం కలిగిన వారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తామని స్పష్టంచేశారు. 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా ఇండ్లను నిర్మించాలని, హాలు, బెడ్‌రూం, వంటగది, బాత్‌రూం తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. మహిళల పేరు మీదనే ఇండ్లను మంజూరు చేస్తామని, ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆహార భద్రతకార్డు ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన మార్గదర్శకాలను వెంటనే విడుదలచేయాలని అధికారులకు సూచించారు.

### కేంద్ర మార్గదర్శకాల ప్రకారమే ఇండ్ల మంజూరు

రాష్ట్రంలో గృహనిర్మాణ పథకానికి ఇంకా మార్గదర్శకాలు విడుదల చేయనప్పటికీ ఇవి కేంద్ర మార్గదర్శకాలకు లోబడే ఉంటాయని అధికారవర్గాలు చెప్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిధులు వినియోగించుకోవాలంటే వారు సూచించిన మార్గదర్శకాలను పాటించాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా కేంద్రం పేదల గృహ నిర్మాణానికి రాష్ట్రాలకు నిధులు అందజేస్తున్నది. కనీసం 350 చదరపు అడుగుల విస్తీర్ణంలో వంటగది, ఒక పడకగది, టాయిలెట్, ఒక హాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. తప్పనిసరిగా మహిళ పేరుతోనే ఇల్లు మంజూరు చేయాల్సి ఉంటుంది. ఒక్కొక్క ఇంటికి రూ.2.5 లక్షల వరకు కేంద్రం భరిస్తున్నది. ఆ నిధులు రావాలంటే రాష్ట్రాలు చేపట్టే గృహనిర్మాణ ప్రాజెక్టులు కేంద్ర మార్గదర్శకాలకు లోబడి ఉండాలి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కేంద్ర మార్గదర్శకాలకు లోబడే రాష్ట్రంలో గృహనిర్మాణ పథకాన్ని అమలుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నది. ఈ ఏడాది 4.5 లక్షల ఇండ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం, గృహనిర్మాణానికి బడ్జెట్‌లో రూ.ఏడు వేల కోట్లు మాత్రమే కేటాయించింది. మిగిలిన మొత్తాన్ని కేంద్ర సహాయంగా, హడ్కో నుంచి రుణంగా సేకరించాలని నిర్ణయించింది.

# బీఆర్ఎస్ టికెట్ నాకే!

మొదటిపేజీ తరువాయి...

పార్టీ వర్గాలు చెప్తున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపి, తీరా అధికారంలోకి రాగానే పట్టపగలే చుక్కలు చూపిస్తున్నదని ప్రజలు గుర్తించారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతున్నది. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్‌పై ఆశావహుల నుంచి అధిష్ఠానంపై ఒత్తిడి పెరిగిందని ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

### మారుతున్న ప్రజల మూడ్

హామీలు అమలు చేయకుండా గత ప్రభుత్వాన్ని తిట్టడానికే పరిమితం కావటంపై కాంగ్రెస్ సర్కారును ప్రజలు ఈసడించుకుంటున్నారు. గత బీఆర్ఎస్ సర్కారుపై కక్షసాధింపే తప్ప, ప్రజావసరాలు తీర్చటం లేదని మేధావి వర్గం పెదవి విరుస్తున్నది. 'తుంటును ఎత్తేసి మొద్దును ఎత్తుకున్నట్టు ఉన్నది' అని సదరు వర్గం విమర్శిస్తున్నది. ఎంతసేపు కేసీఆర్‌ను బోనులో నిలబెట్టాలనే యావ తప్ప ప్రజలకు మేలు చేయాలనే చిత్తశుద్ధి లేదని విశ్లేషిస్తున్నది. వర్షాభావ పరిస్థితులు, నీళ్లలేక ఎండిపోతున్న పంటలు, గోసపడుతున్న రైతులను చూసి చలించని సర్కారు తీరుతో రైతులు, వ్యవసాయంపై ఆధారపడిన అనుబంధ వర్గాల 'మూడ్' మారుతున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్‌తో జతకట్టేందుకు లౌకిక, ప్రజాస్వామిక శక్తులు ముందుకు వస్తున్నాయని అంటున్నారు. అందులో భాగమే బీఆర్ఎస్‌తో బీఎస్పీ పొత్తు అని పేర్కొంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇటు పార్టీలోనూ, అటు బయట బీఆర్ఎస్‌పై ఒత్తిడి పెరుగుతున్నది. తమకు అవకాశం కల్పించాలని కేసీఆర్, కేటీఆర్ సహా పార్టీ ముఖ్యనేతలపై ఆశావహులు ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుత ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీమంత్రుల కుటుంబసభ్యులు, ఉద్యమకారులు, సామాజికవేత్తల నుంచి విస్తృతమైన పోటీ నెలకొన్నది. దీంతో 12 స్థానాల ఎంపికపై అధిష్ఠానం ఆచితూచి అడుగులు వేస్తున్నది.

### చేవెళ్ల నుంచి..

చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి శాసనమండలి మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ, ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే, మాజీమంత్రి కుమారుడు టికెట్ ఆశిస్తున్నారు. టికెట్ ఆశిస్తున్నవారిలో మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్, పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, స్వామిగౌడ్, రోహిత్ రెడ్డి, నాగేందర్‌గౌడ్ తదితరులు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.




### భువనగిరి నుంచి..

**భువనగిరి** లోక్‌సభ స్థానం కోసం తెలంగాణ మలిదశ ఉద్యమకారులు, తెలంగాణ రుచులను ఉద్యమరూపాలుగా మలిచినవారు, విద్యార్థి, పాత్రికేయులు, సామాజిక ఉద్యమా ల్లో భాగస్వాములైనవారు, ఉమ్మడి రాష్ట్రంలోనే కా కుండా స్వరాష్ట్రంలోనూ కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్‌లో కీలకమైన బాధ్యతలు నిర్వర్తించిన నాయకుల నుంచి ఒత్తిడి వస్తున్నది. భువనగిరి నుంచి గుత్తా అమిత్‌రెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, భిక్షమయ్యగౌడ్, చెరుకు సుధాకర్, బాలరాజు యాదవ్, పల్లె రవికుమార్‌గౌడ్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పోటీపడుతున్నట్టు సమాచారం.

### నల్లగొండ నుంచి..

రాష్ట్రంలో ప్రస్తుతం అత్యంత కీలకమైన పదవిలో ఉన్న సీనియర్ నేత కుమారుడు తనకు నల్లగొండ లేదా భువనగిరి టికెట్ ఇస్తే పోటీకి సై అంటున్నారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. గౌడ, యాదవ, సామాజిక వర్గాలకు చెందిన నేతలు పోటీపడుతున్నారు. ఈ స్థానం నుంచి టికెట్ ఆశిస్తున్నవారిలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, కంచర్ల కృష్ణారెడ్డి, సైదిరెడ్డి, తేరా చిన్నపరెడ్డి, వేంరెడ్డి నర్సింహారెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, కడారి అంజయ్యయాదవ్ తదితరులు పోటీపడుతున్నట్టు తెలుస్తున్నది.

### సికింద్రాబాద్ నుంచి..

సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి టికెట్ ఆశిస్తున్నవారిలో తలసాని సాయికిరణ్ యాదవ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ హైదారాబాద్ ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, పార్టీ నేతలు వెంకట్‌రెడ్డి, ఎడ్ల సుధాకర్‌రెడ్డి తదితరులు పోటీపడుతున్నట్టు తెలిసింది.

### జహీరాబాద్ నుంచి..

ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్పొరేషన్లకు చైర్మన్లుగా వ్యవహరించిన యువ నాయకులు (ఒక ముస్లిం, ఒక బీసీ సామాజికవర్గానికి వర్గానికి చెందిన వారు) డీసీఎంఎస్ చైర్మన్‌గా వ్యవహరించిన నాయకుడు, ఒక పారిశ్రామికవేత్త, విద్యావేత్త పోటీ పడుతున్నారు. ఈ స్థానం నుంచి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి, మహమ్మద్ తన్వీర్, మంజరి జైపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, పార్టీ నేత తిరుమల్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నవారిలో ఉన్నట్టు సమాచారం.

### వరంగల్ నుంచి..

వరంగల్ లోక్‌సభ నుంచి జనరల్ స్థానాలకు భారీ పోటీ ఉన్నట్టు ఆశావహుల జాబితా చూస్తే స్పష్టం అవుతున్నది. సిట్టింగ్ ఎంపీ, గతంలో రికార్డు స్థాయిలో మెజారిటీ సాధించిన మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక జడ్పీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న నేత, మాజీ ఉపముఖ్యమంత్రి కుమార్తె, విద్యార్థి నాయకులుగా, ఉద్యమకారులుగా గుర్తింపు ఉన్న ముగ్గురు మాజీ కార్పొరేటర్లతోపాటు, పలువురు విద్యార్థి నాయకులు వరంగల్ టికెట్ ఆశిస్తున్నారు. వీరిలో సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, బీఆర్ఎస్వీ నేత ప్రభాకర్ టికెట్ కోసం పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం.

### మల్కాజిగిరి నుంచి..

ప్రస్తుత ఎమ్మెల్సీతోపాటు, ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు, విద్యాసంస్థల నిర్వాహకుడు, మాజీ మంత్రి తనయుడు, అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కీలకనేతతోపాటు, ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన బలమైన నాయకుడు, బీఆర్ఎస్ సోషల్ మీడియాలో చురుకైన నాయకుడిగా, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ టికెట్ ఆశిస్తున్నవారిలో ఉన్నారని తెలిసింది. వీరితోపాటు ఇద్దరు విద్యావేత్తలు, ఒక పారిశ్రామికవేత్త అవకాశం అడుగుతున్నట్టు సమాచారం. విశ్వసనీయవర్గాల సమాచారం బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశిస్తున్నవారిలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్, నందికంటి శ్రీధర్, మన్నె క్రిశాంక్, చామకూర భద్రారెడ్డి తదితరులున్నట్టు సమాచారం.

### • పులొచ్చి కొరికింది పీక.. ఫొటో కేక!



మాటు వేసి.. పంజా విసిరి.. ఓ ఎద్దును పట్టేసిందో పులి. సరిగ్గా అదే సమయంలో తన కెమెరాతో క్లిక్‌మనిపించాడు హైదరాబాదీ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ జీత్ అమన్. ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో తీసిన ఈ ఫొటో ప్రస్తుతం నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నది.

## రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర

- అడ్డుకోవడంలో కాంగ్రెస్ విఫలం
- రాజ్యాంగాన్ని కాపాడేందుకే పొత్తు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



అచ్చంపేట టౌన్, మార్చి 6 : రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నదని, దీన్ని అడ్డుకోవడంలో కాంగ్రెస్ పరోక్షంగా కమలం పార్టీకి వత్తాసు పలుకుతున్నదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ఏర్పాటు చేసిన బీఎస్పీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో తిరిగి ఆ పార్టీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చడం ఖాయమని ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని రక్షించడం కోసమే బీఎస్పీ బీఆర్ఎస్‌తో కలిసి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నదని తెలిపారు. బీఆర్ఎస్-బీఎస్పీ పొత్తు బహుజనుల ఆకాంక్ష అని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించడానికి రెండు పార్టీలు జతకట్టినట్టు వివరించారు. బహుజనులకు న్యాయం జరగాలనేది పార్టీ లక్ష్యమని, ఈ పొత్తుతో ప్రజలకు మంచి జరగబోతున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్-బీఎస్పీ పోటీ చేసే స్థానాలపై త్వరలోనే విధివిధానాలు, కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. దేశంలో విచ్ఛిన్నకర ఎజెండాను అమలు చేస్తున్న బీజేపీని అడ్డుకోవడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు.

## కరువుంది.. నీళ్లు అడగొద్దు!

మొదటిపేజీ తరువాయి...

డిమాండ్ చేస్తున్నారని వివరించారు. రైతులందరూ పరిస్థితిని అర్థం చేసుకొని, నీళ్లు అడగవద్దని విజ్ఞప్తి చేశారు. ఎండాకాలంలో తాగునీటి కష్టాలు రాకుండా చూడాల్సిన అవసరం ఉన్నదని, అందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఎంత కష్టం వచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని, కలిసికట్టుగా కరువును ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం 110 సెంటర్లలో (రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం) ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ కార్యక్రమాన్ని భవిష్యత్తులో అన్ని గ్రామాలకు విస్తరిస్తామని వెల్లడించారు. ప్రతి సీజన్‌లో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు రైతునేస్తం ఉపయోగపడుతుందని వివరించారు. రైతులు నేరుగా వ్యవసాయ నిపుణులతో మాట్లాడేందుకు వీలు కలుగుతుందని చెప్పారు.

### వరి, పత్తి, మిర్చికే పరిమితం కావొద్దు

రాష్ట్రంలో దాదాపు 26 రకాల పంటలు పండటానికి అనుకూలమైన భూములు, వాతావరణం ఉన్నదని, కేవలం వరి, పత్తి, మిర్చి పంటలకే పరిమితం కావొద్దని రైతులకు సీఎం సూచించారు. ఇతర పంటలు సాగు చేయాలని, పంటమార్పిడి ద్వారా అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. తక్కువ నీళ్లు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంట దిగుబడి వచ్చేలా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. పంటకు గిట్టుబాటు ధర కాకుండా లాభసాటి ధర రావాలనే ఆలోచనతో ప్రభుత్వం కార్యాచరణ చేస్తున్నదని వెల్లడించారు. రైతు భరోసా, రుణమాఫీ, విత్తనాలు అందుబాటులోకి తీసుకురావటం, ఐకేపీ సెంటర్లు, మార్కెట్ యార్డుల ద్వారా పంట ఉత్పత్తుల కొనుగోళ్లను చేపడుతుందని తెలిపారు. వానకాలం నుంచి అమలు చేయబోయే పంటలబీమా పథకంతో రైతులకు మేలు జరుగుతుందని అన్నారు.

### వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుతాం: తుమ్మల

రైతునేస్తం ప్రారంభం సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్షేత్రస్థాయిలోని రైతులతో ఆన్‌లైన్‌లో మాట్లాడారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సేంద్రియ ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో అధిక ధరను పొందేందుకు అవకాశాలను అన్వేషిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులను ఆదుకొనేందుకు పంటల బీమా ప్రీమియంలోని రైతుల వాటాను ప్రభుత్వమే చెల్లించి, అమలుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు.